ఎవరిని నిలదీయాలో ప్రజలకు తెలుసు



దళాయి వలసలో పర్యటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్:

పథకాలు ఎగ్గొట్టి ప్రజల ముందుకు నిసిగ్గుగా వచ్చి కబుర్లు చెప్పి వెళ్లిపోతున్న కూటమి పార్టీనాయకులు, మంత్రులను ప్రజలు చొక్కాపట్టుకునే రోజు వస్తుందని, నడమంత్రపు సిరితో ఎగిసిపడొద్దంటూ గిరిజన శాఖ మంత్రి మాటలకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఘాటుగా బదులిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కురుకూటి, దళాయివలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇటీవల గిరిజన శాఖమంత్రి ఇదే గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులను దూషించి మాట్లాడడంపై గ్రామస్తుల ముందు ఆమె పనితీరు ఏపాటిదో వివరించారు. గతంలో ఆమె మూడు నామినేటెడ్ పదవులు పొంది ఇప్పుడు నాలుగో పదవిలో మంత్రిగా ఉండి నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. జీఓ నంబర్ 3ను పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు చెప్పిన మంత్రులు ఇప్పుడు ప్రత్యామ్నాయం ఆలోచిస్తామని నాలుక మడతవేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రత్యామ్నాయం అంటే ఉన్న అవయవాలను పీకేసి రబ్బరు అవయవాలను తగిలించుకోవడమే నని కూటమి నాయకులు అబద్ధాలు, మోసాలు చేస్తున్నారనడానికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీపై గిరిజనుల తరఫున ఎంత వరకు గిరిజన శాఖ మంత్రి పోరాడుతున్నారో గిరిజనులు గమనిస్తున్నారని సమావేశాల్లో నోటికి వచ్చినట్లు అబద్ధాలు మాట్లాడి వెళ్లిపోతే ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన మహిళలు

చంద్రబాబే ఎక్కువ కాలం ముఖ్యమంత్రి

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఎక్కువ కాలం చంద్రబాబునాయుడు పరిపాలించారని ఒక వేళ గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందలేదంటే దానికి బాధ్యత చంద్రబాబునాయుడిదే అవుతుందని రాజన్నదొర స్పష్టం చేశారు.

మూడు సెంట్ల స్థలం, ఇల్లు ఎప్పుడిస్తారో మంత్రి చెప్పాలి

గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో హామీలిచ్చిన మంత్రి సంధ్యారాణి ఇప్పుడు పేదలకు మూడు సెంట్ల స్థలంతో పాటు ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇలా 100కు పైగా పథకాలు ఇస్తామని ఓట్ల కోసం అబద్ధాలు చెప్పిన కూటమి నాయకుల చొక్కాలు పట్టుకోవాలా? మంత్రులు చొక్కాలు పట్టుకోవాలా? వైఎస్సార్‌సీపీ నాయకుల చొక్కాలు పట్టుకోవాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీను, సువ్వాడ రామకృష్ణ, సువ్వాడ భరత్ శ్రీనివాస్, కళ్లేపల్లి త్రినాథ, కురుకూటి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నిరసన దీక్షల శిబిరంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్

● గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం పెట్టిన మొదటి సంతకం మేరకు తక్షణమే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేసిన ఆరోగ్య (ఏఎన్ఎం) సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలను ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా గిరిజన విద్యార్థుల మరణాలు జరుగుతున్నా ప్రభుత్వానికి, మంత్రులు, ఎమ్మెల్యేలకు పట్టదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విద్యా సంవత్సరంలో ఐటీడీఏ పరిధిలో చదువుతున్న ఇద్దరు గిరిజన బాలికలు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల సంక్షేమం కోసం ఖర్చుచేయాల్సిన డబ్బులతో అడ్డగోలుగా అవసరం లేని భవనాలు, వాటికి రంగులు, మరమ్మతులు ఎందుకని ప్రశ్నించారు. ఐటీడీఏ డబ్బులతో ఏఎన్ఎంల నియామకం చేసి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడవచ్చునని వివరించారు. నిరసన దీక్షలో గిరిజన విద్యార్థి సంఘం, అభ్యుదయ సంఘం, ఏఐఎస్ఎఫ్, పేరెంట్ అసోసియేషన్, ట్రైబల్, రైట్స్ ఫోరం తదితర సంఘాల నాయకులు సురేష్, చంద్రశేఖర్, రామకృష్ణ, లోవరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ స్థలం ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నారాయణపురం గ్రామ పంచాయతీ బోర్డు సభ్యులు

పార్వతీపురం రూరల్: గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణం నిమిత్తం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారని, దీనిపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరుతూ బలిజిపేట మండలం నారాయణపురం గ్రామ పంచాయతీ బోర్డు సభ్యులు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఐదు అంగన్వాడీ కేంద్రాలకు గాను నాలుగు అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో నారాయణపురం పంచాయతీ గ్రామకంఠంలో గల భూములను పరిశీలించి 2026లో పంచాయతీ తీర్మానం చేసి ఒక్కో కేంద్రానికి 0.5 సెంట్ల భూమిని కేటాయిస్తే మూడవ అంగన్వాడీకేంద్రానికి ఏర్పాటు చేసిన స్థలాన్ని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని పక్కా ఇళ్లను నిర్మించుకోవడమే కాకుండా ప్రహరీ నిర్మాణం చేసి ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు.

తక్షణమే దర్యాప్తు నిర్వహించి అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని నిర్మాణం నిమిత్తం అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో వారికి మద్దతుగా బలిజిపేట మండల సీపీఎం నాయకుడు వి.మన్మథరావు పాల్గొన్నారు.

న్యాయం చేసి నిలబెట్టండి

● సీపీఎం నాయకుడు వై.మన్మథరావు

పార్వతీపురం రూరల్: గత 22 సంవత్సరాలుగా బలిజిపేట మండలం అరసాడ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బందిని కులం పేరుతో దూషిస్తూ రాజకీయ కక్షతో గతేడాది అన్యాయంగా తొలగించారని బలిజిపేట మండల సీపీఎం నాయకుడు వై. మన్మథ రావు అన్నారు. ఈ మేరకు తొలగించిన సిబ్బందితో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన సిబ్బందిని మళ్లీ విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు, కలెక్టర్ లీగల్ ఉత్తర్వులు, గవర్నర్ రాజ్‌భవన్ నుంచి ఇచ్చిన ఉత్తర్వులను ఖాతరు చేయకుండా మళ్లీ విధుల్లోకి తీసుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారి చర్యలు తీసుకోవడం లేదని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మన్మథరావు డిమాండ్ చేశారు. ఏ ఆధారం లేని వారికి న్యాయం జరిగేలా చేసి వారి బతుకులను నిలబెట్టాలని బాధితుల తరపున ఆయన డిమాండ్ చేశారు.

నిరసన తెలిపితేనే నియామకం

పార్వతీపురం రూరల్: తమ చిన్నారులకు చదువు చెప్పేందుకు గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన పాఠశాలకు ఉపాధ్యాయుడ్ని నియమించాలని కోరుతూ సోమవారం కురుపాం మండలం జొంగరపాడు గ్రామ ప్రజలు కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. బడులు తెరిచి దాదాపు 40రోజులు గడుస్తున్నా తమ చిన్నారులకు పాఠశాలలో తరగతులు బోధించేందుకు ఉపాధ్యాయుడిని ప్రభుత్వం నియమించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే ఫిర్యాదును స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆదేశాలతో హుటాహుటిన విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి కథనానికి స్పందన

సోమవారం సాక్షి దినపత్రికలో ''గిరిజన విద్యపై చిన్నచూపు'' అనే కథనంలో దేరుపాడులో ఉపాధ్యాయుడు లేక తరగతులకు నోచుకోని విద్యార్థులు అంటూ శీర్షిక ప్రచురితం కావడంతో సోమవారం మధ్యాహ్నం కొమరాడ మండలం దేరుపాడు గిరిజన ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడ్ని నియమిస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాక్షి దినపత్రికకు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇంటింటికీ వెళ్లి కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ శ్రేణులు



పార్వతీపురం మండలం గోపాలపురంలో గడప గడపకు వెళ్లి కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురం రూరల్: ఎన్నికల్లో అమలు కాని, అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు, కూటమి నాయకుల మోసాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తామని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పార్వతీపురం మున్సిపాల్టీలో గల 29వ వార్డులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం చేసిన వంచనపై ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చారో ప్రజలను అడిగి తెలుసుకుని ప్రతిపక్షం బాధ్యతగా హామీలను నెరవేర్చేలా ప్రజల తరఫున గొంతుక అవుతామన్నారు. మోసపూరిత హామీలతో గెలిచిన అనంతరం హామీలు అమలు చేయకుండా మభ్యపెడుతూ 14నెలల కాలాన్ని కాలయాపన చేశారని ప్రజలకు వివరించారు.

అధికార పార్టీని ఎండగతాం

ఇచ్చిన హామీల అమలుకు అధికార పార్టీని ప్రజల తరఫున ఎప్పటికప్పుడు ఎండగడతామని 29వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్క చెల్లెమ్మలకు నేరుగా సంక్షేమాన్ని అందించి వారి ముఖంలో చిరునవ్వులు చూస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అమలు కాని పథకాలతో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు అయోమయ పరిస్థితుల్లో కనిపిస్తున్నారన్నారు. ప్రజలు తాము మోసపోయామని, ఇప్పటికే గ్రహిస్తున్నారని, మరింతగా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేయాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యడ్ల త్రినాథ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పలు వార్డుల కౌన్సిలర్లు లావణ్య, సుధీర్, నేతాజీ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ, నియోజకవర్గంలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు మాధవరావు, కోల సుధ, గండి భాగ్యలక్ష్మి, డి.నాగరాజు, జగన్‌మోహన్‌రావు, మరికొందరు ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శాకంబరి దేవిగా పోలమాంబ దర్శనం



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు మంగళవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు ఈవో చెప్పారు. భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

బియ్యం శుద్ధి చేసి వంట చేయాలి



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: మండలంలోని పాఠశాలలు, వసతిగృహాలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని శుద్ధిచేసి వంటలు చేయాలని ఎంఈఓ జి. సూరిదేముడు అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట వసతి గృహంలో సోమవారం నిర్వహించిన వంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వసతిగృహ సిబ్బందిపై ఉందన్నారు. అన్ని పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కాశీపేటలో 104 వైద్య శిబిరం



రోగులను తనిఖీ చేస్తున్న డా.పి.ఉషారాణి

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సీజన్‌లో జ్వరం, దగ్గు, డయేరియా ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈఓ-1 సామల సింహాచలం

బలిజిపేట: మండలంలోని భైరిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాయానికి ఎంపికైన విద్యార్థిని మేఘనను ఎంఈఓ-1సామల సింహాచలం సోమవారం అభినందించారు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 6వ తరగతిలో జాయిన్ అయ్యేందుకు మేఘన పరీక్ష రాయగా మంచి మార్కులతో సీటు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన మేఘన ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించడం ఎంతో సంతృప్తిగా ఉందని ఎంఈఓ సింహాచలం అన్నారు. ఇది అందరికీ ఆదర్శమైన విషయమని, భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ సిబ్బందిని కోరారు.

నిబంధనలు పాటించాలి

సీతానగరం: వాహన చోదకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సీతానగరం ఎస్సై ఎం.రాజేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో హనుమాన్ జంక్షన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై వాహన దారులతో మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాదం జరిగితే ప్రాణహాని నుంచి బయట పడే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది తిరుపతిరావు, నాయుడు ఉన్నారు.

చంద్రబాబు మాయ మాటలకు బుద్ధిచెప్పండి



మిర్తివలసలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బలిజిపేట: మాయమాటలతో నమ్మించి నయవంచన చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బలిజిపేట మండలంలోని మిర్తివలసలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్ జి.గంగయ్య సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా నిరుపేద ప్రజలకు చేస్తున్న అన్యాయంపై గొంతెత్తి చాటారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీల పత్రాన్ని చదివి వినిపించి దీనిలో మీకు ఈ పథకాలు అందాయా? లేదా? అనేది అడిగి తెలుసుకుని ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం మెడలు వంచి నిరుపేదలకు పథకాలు అందించాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఇంటింటా తిరిగి చంద్రబాబు మోసాలను తెలియపరుస్తున్నామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సర్పంచ్‌లు సుందరరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, పి.నారాయణరావు, పి.రామకృష్ణ, టి.ప్రసాదరావు, కె.సత్యంనాయుడు, వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నచిన్న కారణాలతో తొలగింపు సరికాదు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురం రూరల్: చిన్న చిన్న కారణాలతో చిరుద్యోగుల తొలగింపులు నివారించాలని రాజకీయ కారణాలతో సస్పెండ్ చేసిన కరాసవలస కేజీబీవీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద కరాసవలస కేజీబీవీ సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జిల్లాలో ప్రభుత్వ పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను చిన్న చిన్న కారణాలతో తొలగిస్తున్నారన్నారు. సాలూరు మండలం కరాసవలస కేజీబీవీ సిబ్బందిని మంత్రి పర్యటన నేపథ్యంలో అక్కడ వంటల నాణ్యత లేదన్న చిన్న కారణాన్ని చూపించి ఐదుగురు ఉద్యోగులను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం తమ అనుచరులకు ఉద్యోగాలు కల్పించేందుకు చేసిన ప్రయత్నమే అన్నట్లు కనిపిస్తోందన్నారు. అక్రమంగా తొలగించిన కేజీబీవీ ప్రత్యేకాధికారి, వంట సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో బాధితులతోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, అఖిల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఏఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



ఐటిడిఏ పిఓ అశుతోష్ శ్రీవాస్తవకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఏఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం: ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని కోరుత ఏఐఎస్ఎఫ్ నాయకులు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ వసతిగృహాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ వసతి గృహానికి పక్కాభవనాలను నిర్మించాలని కోరారు. జూలై 6న ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సమయంలో వార్డెన్ విద్యార్థుల పట్ల బాధ్యతా రహితంగా వ్యవహరించారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. డోకిశీల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హరికృష్ణ, దుర్గ, వికాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఫేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలి





మాట్లాడుతున్న అంగన్వాడీ నాయకులు, బలిజిపేట సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

సాలూరు: అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీలు, హెల్పర్లు, మినీవర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ విధానాన్ని రద్దుచేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాలూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శశికళ, జానకి, కుమారి, ఎస్వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు

బయ్యాడకు రోడ్డు నిర్మించండి

● సీపీఎం నాయకుడు కొల్లి గంగునాయుడు



బయ్యాడ గిరిజన యువతతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొల్లి గంగునాయుడు

పార్వతీపురం రూరల్: విద్య, వైద్యానికి అలాగే అటవీ ఉత్పత్తుల అమ్మకాలు చేసుకునేందుకు రోడ్డు సౌకర్యం లేక అత్యవసరమైతే డోలీమోతలతో గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయతీ బయ్యాడ గ్రామ గిరిజనులు అవస్థలు పడుతున్నారని సీపీఎం నాయకుడు కొల్లి గంగునాయుడు ధ్వజమెత్తారు. ఈ మేరకు బయ్యాడ గ్రామ యువత స్వచ్ఛందంగా తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన తెలియజేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సమస్యలు లేకుండా చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం కానరావడం లేదని రూ.15వేల కోట్లు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిని అభివృద్ధి చేయండి, పోలవరం నిర్మాణాలు చేయండి అన్న వ్యాఖ్యలు తప్ప అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఎన్నో గిరిజన గ్రామాలపై దృష్టిసారించడం లేదన్నారు. ప్రధానంగా మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రోడ్లు తక్షణమే నిర్మించాలని, లేకుంటే ప్రతి గ్రామంలో ప్రజాసంఘాలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టి పోరాడతామని హెచ్చరించారు.